గంటాను కలిసిన సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పోర్టు స్టేడియంలో శనివారం రాత్రి జరగనున్న సంగీత విభావరి కోసం దేవీశ్రీ ప్రసాద్ విశాఖ వచ్చారు. సినీ సంగీత కార్యక్రమాలను నగర ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని, ఈ విభావరి కూడా విజయవంతం కావాలని గంటా ఆకాంక్షించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్న దేవీశ్రీ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. తాను చేపడుతున్న కొత్త ప్రాజెక్టుల గురించి దేవీశ్రీ ప్రసాద్ ముచ్చటించారు.

గ్రేటర్ విశాఖ మేయర్ పీఠం ఎవరిది....?

నేడే అవిశ్వాస ప్రత్యేక సమావేశం
క్యాంప్ రాజకీయాలు నడిపిన అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు
నేటి సమావేశంపై నెలకొన్న ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గత నెల రోజులుగా గ్రేటర్ విశాఖ నగర మేయర్ పీఠాన్ని కూటమి పరం చేసుకునేందుకు పెట్టిన అవిశ్వాస ప్రత్యేక కౌన్సిల్ సమావేశం భారీ భద్రత మధ్య 19న (నేడు) జరగనుంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం అవిశ్వాసం నెగ్గేలా కూటమి వ్యూహాలు పూర్తి చేసింది. శుక్రవారం సాయంత్రం మలేషియా నుంచి కూటమి కార్పొరేటర్లు నగరానికి చేరుకున్నారు. మరోపక్క తమ 58 మంది కార్పొరేటర్లకు వైసీపీ విప్ జారీ చేసింది. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వొద్దని విప్ జారీ చేయడంతో పాటు ప్రత్యేక సమావేశానికి హాజరు కాకూడదని వైసీపీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విప్ జారీ తర్వాత వైసీపీకి మాజీమంత్రి అవంతి కూతురు లక్ష్మీప్రియాంక రాజీనామా చేయడం విశేషం. వైసీపీ కి చీఫ్ విప్‌గా ఉన్న లక్ష్మీప్రియాంక పార్టీకి రాజీనామా చేయడంతో విప్ పనిచేస్తుందా లేదా అన్నది గందరగోళంగా మారింది. ఇప్పటికే ఈ మేయర్ అవిశ్వాస ఓటింగ్ కు వామపక్ష కార్పొరేటర్లు హాజరుకామని స్పష్టం చేశారు. నాలుగేళ్ల కిందట జరిగిన ఎన్నికలలో విశాఖ మేయర్ పీఠాన్ని అప్పటికి అధికారంలో ఉన్న వైసీపీ దక్కించుకుంది. జీవీఎంసీ పరిధిలో 98 కార్పొరేటర్ల స్థానాలు ఉండగా, వాటిలో 58 స్థానాల్లో వైసీపీ కార్పొరేటర్లు విజయం సాధించారు. బీసీ వర్గానికి చెందిన మహిళ గొలగాని హరి వెంకట కుమారిని వైసీపీ అధిష్ఠానం మేయర్ని చేసింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలై తెలుగుదేశం కూటమి అధికార పగ్గాలు చేపట్టింది. దీంతో జీవీఎంసీలో పలువురు కార్పొరేటర్లు వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. మేయర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కూటమి పార్టీలు సమాయత్తమైంది. నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి అయితే కానీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం లేకపోవడంతో ఇంత కాలం వేచి చూసిన కూటమి నేతలు అవిశ్వాసానికి సన్నద్ధమయ్యారు. ఇప్పటికే క్యాంప్ రాజకీయాలు నిర్వహించి గ్రేటర్ మేయర్ పీఠాన్ని తమదే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పరిసరాల్లో కఠిన ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. పూర్తి పారదర్శకంగా కౌన్సిల్ సమావేశం జరిగేలా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు మినహా ఇతరులకు జీవీఎంసీ పరిసరాల్లోకి నో ఎంట్రీ విధించారు. జీవీఎంసీ ఆఫీసు పరిధిలో సుమారు 300 మంది పోలీసులను భద్రత కోసం ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

మేయర్ పీఠంపై జరుగుతున్న అవిశ్వాస తీర్మాణంపై జనసేన కార్పొరేటర్లు సమావేశమై చర్చించుకుంటున్న దృశ్యం →

అర్హులైన టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ళను కేటాయించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కు వినతిపత్రం ఇస్తున్న కశిరెడ్డి

విశాలాంధ్ర-పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గ పరిధిలో సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సీపీఐ నేత కశిరెడ్డి సత్యనారాయణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కోరారు. వివరాల్లోకి వెళితే.. గాజువాక నియోజకవర్గ పరిధిలో 6,890 టిడ్కో గృహాలు లాటరీ ద్వారా 2018లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారందరికీ విక్రయ ఒప్పంద పత్రాలు ఇచ్చారు. ఎ-బ్లాక్ 300 చ.అ., బి-బ్లాక్ 365 చ.అ., సి-బ్లాక్ 430 చ.అ. ఇళ్ళను నిర్మించారు. వాటికి లబ్ధిదారుని వాటా పూర్తిగా చెల్లించారు. కానీ లబ్ధిదారులకు మాత్రం ఈ రోజు వరకు పూర్తిగా గృహాలను అందజేయలేదు. వారికి కావలసిన మౌలిక సదుపాయాలను కల్పించలేదు. వారిలో చాలామంది బ్యాంకు ద్వారా లోన్ తీసుకొని టిడ్కో గృహాలకు కట్టవలసిన డబ్బును కూడా మొత్తం చెల్లించారు. అందులో కొంతమంది బ్యాంక్ లోన్లకు ఇంకా నెలవారీ వాయిదాలు కట్టుకుంటూ వున్నారు. మరియు కొంతమంది ఎంపిక చేసిన లబ్ధిదారులకు డాక్యుమెంట్స్(సేల్ డీడ్) ఇవ్వకుండా గాజువాక యు.సి.డి. ఆఫీసు చుట్టూ, గాజువాక జివియంసి చుట్టూ అధికారులు తిప్పుతున్నారు. ఎంపికయిన లబ్ధిదారులకు ఇళ్ళను కేటాయించకుండా కొంతమంది బినామీలను యు.సి.డి. ఆఫీసర్లు తయారుచేసి వారికి అక్రమంగా ఇళ్ళను కేటాయిస్తున్నారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో పెదగంట్యాడ, బానోజీతోట, దువ్వాడ, ట్రైజంక్షన్, అంగనంపూడి ఏరియాలలో ఉన్న టిడ్కోగృహాలకు నీటి సదుపాయం మరియు ఇతర మౌలిక సదుపాలయాల కోసం ఎన్నిసార్లు ఆఫీసులు చుట్టూ తిరిగినా, ఏ విధమైన ప్రయోజనం లేకపోవడం. అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంచేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో టిడ్కో ఇళ్ళకు మాత్రం 0% బడ్జెట్ కేటాయించడం ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడమే తప్ప మరేమీ కాదు. తక్షణమే స్పందించి అర్హులైన టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ళను కేటాయించాలి.. జరుగుతున్న అవకతవకలపై దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కశిరెడ్డి సత్యనారాయణ శుక్రవారం విజయవాడ సీపీఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణని కలిసి చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి, త్వరితగతిన పరిష్కారం చూపాలని వినతిపత్రం అందజేసారు.

మే 14 నుండి శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు

ఆలయ పరిపాలనాధికారి సురేష్ బాబా

విశాలాంధ్ర-విశాఖ సిటీ: జ్ఞానాపురంలోని శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలను మే 14 నుండి 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పరిపాలనాధికారి డి.వి.ఎస్. సురేష్ బాబా తెలియజేశారు. గతంలో మే నెల మూడో శని, ఆదివారాల్లో రెండురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించే వారమని ఈ ఏడాది నుండి భక్తుల సౌకర్యార్థం ఐదు రోజులపాటు వేడుకలు జరపదలిచామని తెలిపారు. మే 14న రాటోత్సవం, చాటింపు, 15,16తేదీల్లో సాంస్కృతికోత్సవాలు, 17న తొలేళ్ళు, 18వ తేదీన వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయని పేర్కొన్నారు. జాతరోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఆలయాన్ని అధునతన విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరిస్తామన్నారు. ఉత్సవాలకు కావలసిన సామాను కోసం టెండర్లు పిలిచామని చెప్పారు. సేవ గరిడి, భక్తి గీతాలాపన, రేలరేలా జానపథం, ఇతరములకు శనివారం, మహా అన్నదానం, వంట సామాను సప్లయర్స్ కోసం 24వ తేదీ, ప్రేములతో బ్యానర్లకు మే 1వ తేదీ ఉదయం ఉదయం 9నుండి 11 గంటల్లోగా షీల్డ్ టెండర్లు ప్రథమ ధరావత్తుతో సమర్పించాలని చెప్పారు.

24న తొలివిడత చందనం అరగదీత ప్రారంభం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సమర్పణ కు గాను ఈ నెల 24న తొలివిడత చందనం అరగదీత ప్రారంభం కానుంది. ఈ నెల 30న సింహాద్రి నాధుని చందనోత్సవం(నిజరూప దర్శనం) జరుగ నున్నది. అదే రోజున సింహా గిరీశుడు నిజరూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. చైత్ర బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 24న పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ఆలయంలో తొలి గంధం అరదీతకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రధాన అర్చకులు జి. శ్రీనివాసాచార్యులు, స్థానాచారులు రాజగోపాల్, ఇంచార్జ్ ఈఓ కె.సుబ్బారావు, అధికారులు తెలిపారు. చైత్ర బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 24న సింహగిరిపైనున్న ఆలయంలో తొలి గంధం అరదీతకు శ్రీకారం చుట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు చందనం అరగదీతకు అర్చకులు ముహార్తం నిర్ణయించినట్లు ఈవో సుబ్బారావు పేర్కొన్నారు. 24వ తేదీన భక్తులకు 7.30 గంటల తర్వాత స్వామివారి దర్శనాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రోజా సిగ్గుతో తలదించుకునేలా ప్రవర్తించారు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య

విశాలాంధ్ర-విశాఖ సిటీ: మాజీ మంత్రి రోజా సభ్య సమాజంలో సిగ్గుతో తలదించుకునేలా ప్రవర్తించారని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య అన్నారు. శుక్రవారం విశాఖలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజా కోసం మాట్లాడాలి అంటే సిగ్గు పడుతున్నామన్నారు. మనుషుల్లో మూడు జాతులు ఉంటాయని, రోజా నాల్గో జాతి కి చెందిన వ్యక్తని ఎద్దేవా చేశారు. రోజా సినిమా టికెట్ అమ్మినట్టు, టిటిడి టికెట్లు అమ్ముకున్నారని ఆరోపణలు ఉన్నాయన్నారు. రోజా మంత్రి గా ఉండి ఒక్క మంచి పని చేయలేదని విమర్శించారు. టిటిడి టిక్కెట్లు వ్యాపారం లేక, డబ్బులు లేక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. కరుణాకర రెడ్డి ఆగమ శాస్త్ర నిబంధనలు విరుద్ధంగా ప్రవర్తించారన్నారు. జనసేన నేత, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ ఒంటిమిట్ట ఆలయంలో కళ్యాణ ఉత్సవాలు జరుగుతుంటే, వైసిపి మూకలు టిటిడి గోశాల విషయంలో రాద్ధాంతం చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లో రోజా అడుగు పెట్టగానే వైఎస్ మృతిచెందారన్నారు. రోజా ఐరన్ లెగ్, చిత్తూరు చిత్రాంగి అని వ్యంగ్యంగా సంబోధించారు. రోజా అంటే కంపు...! ప్రస్తుతం రాష్ట్ర పరిపాలన సుగంధ పరిమళ ఇంపుగా ఉందన్నారు. వైసిపి హయాంలో టిటిడి లో అన్యమత ప్రచారం చేశారని ఆరోపించారు. ఆడుదాం ఆంధ్రాలో రోజా కోట్లు దోచుకున్నారని విమర్శించారు. గతంలో టీడీపీ ఎమ్మెల్యే బండారు చేసిన వ్యాఖ్యలు వాస్తవమా? కాదా? రోజా చెప్పాలన్నారు. రోజా కి దమ్ము ఉంటే ఆ.. సినిమాల్లో తాను నటించలేదని వెంకటేశ్వర స్వామి ముందు ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. రోజాకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. విశాఖ వాళ్ళు అంటే అంత చులకనా.! బీసీ నాయకుడు పల్లా శ్రీనివాసరావు వైజాగోడు అని అవమానపరుస్తున్నారా అని నిలదీశారు. ఇదే విశాఖను రాష్ట్ర రాజధాని అని పేరు చెప్పి దోచేశారని ఆరోపించారు. మాజీ మంత్రి రోజా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు,టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కు వారం రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలి...లేదంటే ఇదే విశాఖ ఎయిర్ పోర్ట్ లో అడుగు పెట్ట నివ్వం అని హెచ్చరించారు.

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పెందుర్తి: మే నెల 10, 11 తేదీలలో నగరంలోని మురళి నగర్ లో జరిగే సిపిఐ విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ .శ్రీనివాసరావు సమితి సభ్యులు వై. రాంబాబు తదితరులు ప్రజలకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 97 వ వార్డు సుజాత నగర్, భగత్ సింగ్ భవన్ సిపిఐ కార్యాలయంలో ఈ మేరకు కరపత్రాలను శుక్రవారం సాయంత్రం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం అన్ని రంగాల అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో స్వాతంత్రోద్యమం కంటే ముందే ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగిస్తోందని గుర్తు చేశారు. వచ్చే డిసెంబర్ 26 నాటికి సిపిఐ ఆవిర్భవించి వందేళ్ళు పూర్తవుతున్నందున దేశవ్యాప్తంగా శతవసంతాల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మోడీ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెందుర్తి శాఖ కార్యదర్శి ఎన్ ఆసిరినాయుడు, సీనియర్ పార్టీ సభ్యులు త్రినాథ్, యోగి, రమణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.15 లక్షల చెక్కు అందవేత..

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయితీ మహాలక్ష్మిపురం గ్రామంలో ఇటీవలే అనకాపల్లి మందుగుండు ప్రమాదంలో మరణించిన మేడిసి హేమంత్ కుటుంబాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరామర్శించారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.15 లక్షల చెక్ ను అందించి భరోసా కల్పించారు. వారి కుటుంబానికి ఇంకా ఏ విధమైన సహకారం కావాలన్న అందిస్తాను అని స్వయంగా ఆయనే హామీ ఇచ్చారు. స్థానిక కూటమి నాయకులు,ప్రజలు అందరూ వచ్చి ఎంఎల్ఏ కి ఇంత త్వరగా చెక్ అందించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

చిట్టివలస సబ్ స్టేషన్ వద్ద బాలాజీ నగర్ యాతపేట మహిళలు ఆందోళన

మద్దతు తెలిపిన సిపిఎం పార్టీ

విశాలాంధ్ర-తగరపువలస: ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ వైర్ల గురించి చిట్టివలస సబ్ స్టేషన్ వద్ద బాలాజీ నగర్ యాతపేట మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమమునకు సిపిఎం పార్టీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ జీవీఎంసీ 1, 2 వార్డుల మధ్యలో హైవే రోడ్డు కి ఆనుకొని ఉన్న ఈతపేట లో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని ఇళ్లపై వేలాడుతూ ఉన్నాయని అనేకసార్లు విద్యుత్ అధికారులకి ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవట్లేదని గతంలో అనేక ప్రమాదాలు జరిగాయని మహిళలు ఆందోళన చేపట్టారు. వెంటనే విద్యుత్ అధికారులు సమస్యను పరిష్కారం చేసి ప్రజలు ప్రాణాలు కాపాడాలని మూర్తి అన్నారు. చిట్టివలస సబ్ స్టేషన్ ఏ ఈగారికి మెమోరండం ఇచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జోన్ కమిటీ నాయకులు రవ్వ నర్సింగరావు ఎస్ అప్పలనాయుడు సభ్యులు రేస్ నరసింగరావు రేసు చెన్నారావు స్థానిక గీత కార్మిక సంఘం నాయకులు రేసు రమణ రేస్ బంగారు రాజు స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పేదలకు నాణ్యమైన వైద్యం అందిం చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగ్గట్టుగా వైద్యాధికారులు పనిచే యాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ దువారపు రామారావులతో కలసి కేజీహెచ్ ను ఇన్ ఛార్జ్ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఓపి, హెల్ప్ డెస్క్ కౌంటర్లను మంత్రి పరిశీలిం చారు. అనంతరం క్యాజువాలిటీ, మందుల పంపిణీ విధానము, రోగులకు మందులు ఇచ్చే స్థలం, మత్తు పదార్థాల విమోచన కేంద్రం, ఎండోక్రైనాలజీ, గైనకాలజీ విభాగం, భావనగర్ వార్డు, రాజేంద్రప్రసాద్ వార్డు, పిల్లల వార్డులను మంత్రి తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆసుపత్రి ఆవరణలో శానిటేషన్, సెక్యూరిటీ, రోగులతో పాటు సహాయంగా వచ్చే వారికి అందుతున్న అవసరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. కె జి హెచ్ లో అన్ని విభాగాలు పరిశీలించి రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్యం, ఇతర సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్న అనంతరం వైద్యులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి వార్డులో ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ చాలా ముఖ్యమన్నారు. ఎమర్జెన్సీ మందులు, ఇంజక్షన్స్ ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వార్డులో డ్యూటీ డాక్టర్ల పేరుతోపాటు డ్యూటీ రోస్టర్ ఉంచాలన్నారు. వార్డులలో శానిటేషన్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శానిటేషన్, సెక్యూరిటీ మరింత సమర్థవం తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో బర్త్ సర్టిఫికెట్ మంజూరు తో పాటు శిశుఆధార్ నమోదు వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ఆప్యాయంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఇన్చార్జి మంత్రి తెలిపారు. ఆస్పత్రిలో శిశు మార్పిడిలు జరగకూడదని, అటువంటి సంఘటనలు జరిగితే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి అంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన అదనపు భవనాలు నిర్మిస్తామని, అదేవిధంగా సిబ్బందిని నియమిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని, ఆ సమావేశంలో వైద్యాధికారులు తెలియజేసిన అవసరాలను గుర్తించి వాటిని తీరుస్తున్నామని మంత్రికి వివరించారు. అదేవిధంగా ఓపి టోకెన్ సిస్టం రోగులకు సంబంధించిన టెస్ట్ రిపోర్టులు ఓపి డాక్టర్ దగ్గరకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని, వార్డులలో గాలి వెలుతురు ఉండే విధంగా చర్యలు చేపడతామని మంత్రికి వివరించారు. ఆసుపత్రి యూనిట్ హెచ్ఓడీలు తమ యూనిట్ ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీహెచ్ లో వైద్యం కొరకు చుట్టుపక్కల జిల్లాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తున్నారని, అంతటి ప్రాముఖ్యత కలిగిన కేజీహెచ్ లో శానిటేషన్ నిర్వహణ పట్ల యూనిట్ హెచ్ఓడీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎటువంటి రోగం కైనా కేజీహెచ్ లో వైద్యం దొరుకుతుందనే ఆశతో రోగులలో వస్తారని, రోగులు రెండు చేతులు జోడించి సంతోషంతో నమస్కరించే విధంగా వైద్యులు వైద్యం చేయాలని కోరారు.ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, కెజీహెచ్ సూపరింటెండెంట్ కె.శివానంద, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, మాజీ ఎమ్మెల్సీ దువారపు రామారావు, కేజీహెచ్ అన్ని విభాగాల హెచ్ఓడీలు, అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాకై కూటమి ప్రభుత్వం కృషి చెయ్యాలి!

పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

విశాలాంధ్ర-పెందుర్తి : ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ముగిసిన అద్యాయమని 16 వ ఆర్థిక సంఘం చైర్మన్ చెప్పడం విచారకరమని పిసిసి ప్రధాన కార్యదర్శి ఓబిసి డిపార్ట్మెంట్ ఇన్చార్జ్ మూల వెంకట్రావు ఆవేదన వెలిబుచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇస్తామని స్వయంగా ప్రదానమంత్రి వాగ్దానం చేశారని, దీనికోసం రాష్ట్ర ప్రజలు గత పది సంవత్సరాలుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆశలను వమ్ము చేయిదని నమ్మి తున్నట్లు పేర్కొన్నారు. 14వ ఆర్థిక సంఘం చైర్మన్ ఇది తమ పరిధి లోకి రాదని చెప్పగా, 16వ కమిషన్ చైర్మన్ ముగిసిన అద్యాయం అని చెప్పడం విచారకరమన్నారు. ప్రణాళికా సంఘం దద్దయినంత మాత్రాన ప్రభుత్వ విధానం మారదని, ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమైనందున, నీతి అయోగతో నిమిత్తం లేకుండా 16వ ఆర్థిక సంఘం రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని ప్రత్యేక హెూదా కోసం సిఫారసు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టు బడులకోసం విదేశీ కంపెనీల చుట్టూ తిరిగి నిరాశ పడటంతో పాటు, వారు పెట్టే అలవిమాలిన నిబంధనలకు లొంగి మనవనరులు అప్పనంగా అప్పగించడం మాని ప్రత్యేక హెూదా కోసం గట్టిగా ప్రయత్నిస్తే పెట్టుబడులు వాటంతట అవే వస్తాయని మూల వెంకటరావు స్పష్టం చేశారు. హోదాతో లభించే అవకాశాలను బట్టి పెట్టుబడిదారులు మనచుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. అందువలన రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక హెూదా ప్రాముఖ్యతను గుర్తించాలని కోరారు. ప్రత్యేక హోదా లేని రాష్ట్రానికి నిధులు పరిశ్రమలు పెద్దగా రాకపోవడంతో అప్పులతో కాలాన్ని వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, దీనివలన రాష్ట్రం అన్ని విధాల వెనుకబడిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. గత పది సంవత్సరాల అనుభవం దీన్ని రుజువు చేసిందని వెల్లడించారు. రాష్ట్రంలో సంపన్నులు ఎవరూ కూడా పెట్టుబడి పెట్టడానికి సిద్ధ పడడంలేదని, ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్ళి పోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి దనవంతులు పెట్టుబడులు పెట్టేలా కృషి చేయ్యాలని కోరారు. అలాగే ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని, ముఖ్యంగా ప్రధాన మంత్రికి ఈ విషయాన్ని వివరించి చెబితే తప్పకుండా హామీ ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు మూల వెంకటరావు ప్రకటించారు.

వైసిపి హయాంలో కుంటుపడ్డ ఉత్తరాంధ్ర అభివృద్ధి

- విశాఖకు గతంలో వచ్చిన సంస్థలు వెనక్కి వెళ్లాయి
- ఎంపీ శ్రీ భరత్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: వైసిపి హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి కుంటుపడిందని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తో కలిసి మాట్లాడారు. ఐటీ సంస్థలు అడిగిన చిన్న చిన్న విషయాలు గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని, అందుచేతనే గతంలో వచ్చిన సంస్థలు వైసీపీ ప్రభుత్వంలో వెనక్కి వెళ్లిపోయాయన్నారు. విశాఖలో 33 ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఒకరి ఇల్లు కోసం 450 కోట్లు వైసీపీ ప్రభుత్వం ఖర్చుపెట్టిందని గత ప్రభుత్వం చేసిన తప్పులను చెప్పు కొచ్చారు. భోగాపురం ఎయిర్ పోర్టు కనెక్టివిటీ కోసం రూ. 400 కోట్లు తో 17 రోడ్లను ప్రతిపాదించామని చెప్పారు.విశాఖలో టిసిఎస్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారన్నారు. రాష్ట్రంలో విద్య ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విశాఖ ను ఐటీ హబ్ గా చేయాలని మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. టాటా సంస్థకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, టాటా కోసం మాట్లాడే స్థాయి వైసీపీ కి లేదన్నారు. గత ఐదేళ్ల లో జీడీపీ 5 శాతంగా ఉంటే కూటమి వచ్చి 10 నెలలో దేశంలో రెండవ స్థానంలో ఏపీ చేరిందన్నారు. గతంలో అవకాశం ఉన్నా బొత్స సత్యనారాయణ విశాఖ కు ఓక్స్ వేగన్ తీసుకురాలేకపోయరని, కీయా తో అనంతపురం చాలా అభివృద్ధి చెందిందన్నారు. విమానాలు రద్దు పై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో మాట్లాడామన్నారు. రైల్వే జోనల్ కార్యాలయం పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పారు. ఉత్తరాంధ్ర పై ప్రత్యేక దృష్టి : ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం లోక్ సభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, లోకేష్ లు ఉత్తరాంధ్ర అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర వెనుకుబాటుకు కారణమైన వారికి మాట్లాడే హక్కు లేదన్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కేంద్రం తో మాట్లాడి స్టీల్ ప్లాంట్ కు ఆర్థిక పరిపుష్టి తెచ్చారన్నారు. రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి మాట్లాడుతూ వైసిపి కార్యాలయానికి ఎకరానికి రెండు రూపాయలకి ఇచ్చినప్పుడు నోరు మెదపని వారు ఇప్పుడు టాటా వంటి వారు వస్తుంటే ఓర్వలేక పోతున్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతాబ్బాయ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కు

విశాలాంధ్ర-ఆనందపురం : అనకాపల్లి జిల్లా కోటఊరట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో జరిగిన బాణాసంచా పేలుడులో మరణించిన భీమిలి మండలం రేఖవాని పాలెంకు చెందిన మేడిసి హేమంత్ కుటుంబాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం తరపున ప్రకటించిన రూ.15 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును వారికి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హేమంత్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు డి.ఎ.ఎన్.రాజు, వై.అనీల్ ప్రసాద్, జనసేన నాయకులు శాఖారి శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన చిన్న శ్రీను

విశాలాంధ్ర -పద్మనాభం: పద్మనాభం మండలంలోని విలాస్కాన్ పాలెం గ్రామానికి చెందిన వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు, బాందేవపురం మాజీ ఎంపీటీసీ బాయ్ అప్పలస్వామి ఇటీవల అకాల మరణం పొందడంతో వారి కుటుంబాన్ని భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త చిన్న శ్రీను శుక్రవారం పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకరి గిరి బాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు,మండల వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు,మండల వైయస్సార్ పార్టీ యూత్ అధ్యక్షులు భూగత సత్యనారాయణ,పార్టీ సీనియర్ నాయకులు బోని సన్యాసినాయుడు ,ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఋషికొండ ప్యాలెస్ ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలి

బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ

విశాలాంధ్ర-విశాఖ సిటీ : నగరంలోని ఋషికొండ ప్యాలెస్ ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలని బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కో రారు. ఈ మేరకు నగరంలోని డాబా గార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విషయాన్ని ఇప్పటికే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ యాదవ్ దృష్టికి తీసుకొని వెళ్ళామని తెలిపారు. వారు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకొని వెళ్తా మని చెప్పారని పేర్కొన్నారు. విశాఖ జిల్లా బుద్ధ చారిత్రక వారసత్వం కలిగిన ప్రాంతమని జైనమతం ఆనవాళ్ళు కూడా ఈ ప్రాంతంలో అనేక ఉన్నాయని తెలిపారు. తొట్ల కొండ, బొజ్జన్న కొండ, భావికొండలతోపాటు శ్రీకాకుళం దాటి పొరుగు రాష్ట్రాల వరకు ఈ సంస్కృతి, సంప్రదాయాలు వ్యాప్తి చెంది ఉన్నాయని పేర్కొన్నారు. పరిశోధనలు నేపధ్యంలో అనేక చారిత్రక ఆధారాలు బయటకు వచ్చాయని తెలిపారు. కళింగ ప్రాంతంలో భాగమైన బరంపురం నుండి మద్రాసు తీర ప్రాంతం చివరి వరకు తెలుగు భాష, సాంస్కృతిక సాంప్రదాయాలు చెప్పుకో తగినవిగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాంతానికి చెందిన అనేక చారిత్రక సంపద హైదరాబాద్ మ్యూజియంలో ఉండిపోయిందని చెప్పారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి మ్యూజియం లేదని చారిత్రక వారసత్వ సంపదకు భద్రపరిచే నిలయంగా ఋషికొండ ప్యాలెస్ ను మార్చాలని తెలిపారు. బౌద్ధ ధర్మం ప్రభావం ప్రపంచంలో అనేక దేశాల్లో ఉందని ఇలాంటి మ్యూజియం వల్ల అనేక మంది పర్యాటకుల సందర్శన ద్వారా విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అల్లు అప్పారావు, జె. రాంప్రభు, జె.వి భాస్కరరావు, బోనెల అప్పారావు, ఎస్. ధర్మారావు, బి.ఉమామహేశ్వరి, సి. రాంజీ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవంకు బస్సులన్నీ ఫిట్ గా ఉండాలి : ఆర్టీసీ ఈడి

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయనగరం జోన్ కేస్ బ్రహ్మానంద రెడ్డి , రీజనల్ మేనేజర్ మేనేజర్ విశాఖపట్నం బి అప్పలనాయుడు శుక్రవారం సింహాచలం బస్ డిపో తనిఖీ చేశారు. వివిధ రూట్ లకు తిరిగే బస్సులను తనిఖీ చేసారు ఈ సందర్భంగా సిబ్బంది డిపోతో మాట్లాడుతూ ఈనెల 30వ తారీఖున జరగబోయే చందనోత్సవం కు బస్సులన్నీ మంచి కండిషన్ లో ఉంచి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యము జరగకుండా చూసుకోవాలని సిబ్బందికి విజ్ఞప్తి చేసారు. ప్రయాణికులకు అనుగుణంగా గోశాల నుండి సింహాచలం 35 బస్సులు, అడివివరం నుండి సింహాచలం 15 బస్సులు తిప్పుతామని తెలియజేసారు. గోసాల నుండి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ కాంప్లెక్స్ గాజువాక కొత్తవలస మొదలగు ప్రాంతాలకు సర్వీస్ బస్సులు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సిటిఎం శ్రీ జి సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్, డిపో మేనేజర్ సింహాచలం రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ కొండలరావు సూపర్వైజర్లు గ్యారేజీ సిబ్బంది డ్రైవర్లు, కండక్టర్లు అందరూ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై భీమిలి స్టేషన్లో కేసు నమోదు

విశాలాంధ్ర-భీమిలి: మతిస్థిమితం లేని తన కొడుకు రెండు రోజులుగా కనబడటం లేదని ఒక తండ్రి భీమిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జీరుపేట గ్రామం భీమిలి మండలానికి చెందిన బైరెడ్ల రామకృష్ణ అనే వ్యక్తి గత 12 సంవత్సరాలుగా మతిస్థిమితం లేని వ్యాధితో బాధపడుతున్నాడని, రెండు రోజుల క్రితం బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇప్పటివరకు రాలేదని అతని తండ్రి బైరెడ్ల నారాయణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు బాధ్యతలను హెడ్ కానిస్టేబుల్ బివి రమణ కు అప్పగించామని భీమిలి పోలీస్ స్టేషన్ వారు తెలియజేశారు. కేసును త్వరగా పరిష్కరిస్తామని వారి యొక్క కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

అంబేద్కర్ విగ్రహం తొలగించాలన్న ఆర్డీవో పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 97 వార్డు చిన్న ముసిడివాడ, ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించమని అధికారులను ఆదేశించిన ఆర్డిఓ శ్రీలేఖ పై చర్యలు తీసుకోవాలని సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి. జగన్ డిమాండ్ చేశారు. సెలవు రోజున ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీకి చెందిన దళిత బహుజనులను ఆఫీసుకు పిలిపించి వారు నిర్మించుకున్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించమని చట్ట విరుద్ధంగా ఆదేశిస్తూ ఆఫీసులోనే వారిని నిర్బంధించడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని ఆయన విమర్శించారు. ఈ చర్యను సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఓ ప్రకటనలో వెల్లడించారు.

వక్ఫ్ సవరణ చట్టం 2025 ను వెంటనే రద్దు చేయాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా

విశాలాంధ్ర-పెందుర్తి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025 ను వెంటనే రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీవుల్లా డిమాండ్ చేశారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మైనార్టీ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నగరంలోని బీసీ రోడ్ లో శుక్రవారం ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 పైగా మసీదులకు చె6 ప్రతినిధులు, వేలాదిమంది ముస్లిములు, మహిళలు పాల్గొని, వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని నినదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ షేక్ షఫీ ఉల్లా మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ గవర్నమెంట్ మత విద్వేషాలు రెచ్చగొడుతూ అన్నదమ్ముల్లా కలిసి ఉన్న హిందూ ముస్లింల మధ్య గొడవలు పెడుతూ మత రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వెంటనే వక్ఫ్ 2025 సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, లేనియెడల ఆందోళనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి ఖలీశా, ఎస్.కె మదిన వల్లి, ఎస్కే అన్సర షేక్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు సన్మానం

విశాలాంధ్ర -వి. మాడుగుల: మాడుగుల మోద కొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు పుప్పాల అప్పలరాజు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా ఎంపిక కావడంతో ఆయనకు శ్రీదేవి ఆలయంలో శ్రీదేవి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానిచారు. రానున్న కాలంలో అప్పలరాజు మరెన్నో పదవులు చేపట్టాలని కోరారు. శ్రీదేవి ఆలయ అధ్యక్షులు ఎస్వి.కొండలరావు, కార్యదర్శి అన్నంనీడి ప్రసాదరావు, బి.నరసింహమూర్తి, బత్తుల యల్లారావు, కండిపిల్లి కొండలరావు, ఇల్లపు రమణ, ఖండివరం రాజు, కొర్ని దేముడు, మేస్త్రి సూరిబాబు, గౌరీపట్టపు జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

4వ ఎంపైర్ సీజన్ 2ని ప్రారంభించిన బ్రిటానియా 50-50

విశాలాంధ్ర-విశాఖపట్నం: అభిమానుల అభిరుచిల ఆధారంగా, బ్రిటానియా 50-50 దాని అత్యంత ప్రియమైన 4వ అంపైర్ ప్రచారం యొక్క సీజన్ 2తో తిరిగి వచ్చిందని బ్రిటానియా మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సిద్ధార్థ్ గుప్తాతెలిపారు. అయితే ఈసారి ఈ సీజన్ 2 బ్రాండ్ న్యూ డిజిటల్ హోమ్ 5050 క్రికెట్ డాట్ ఇన్ కు మారుతుందన్నారు. ఇది అభిమానులు క్రికెట్ వినోదాన్ని ఆస్వాదించగల మరియు వారి అంతర్ దృష్టిని పరీక్షించగల ఉత్తేజకరమైన వేదిక అని చెప్పారు. ష్పాంగ్ రూపొందించిన బ్రిటానియా 50-50 4వ అంపైర్ సీజన్ 2 అభిమానులు ప్రత్యేకమైన మ్యాచ్ పరిస్థితులను చూసి, తరువాత ఏమి జరుగుతుందో అంచనా వేసేటప్పుడు అంపైర్ స్థానంలోకి అడుగు పెట్టడానికి వీలు కల్పిస్తుందన్నారు. సరైన అంచనాలు మ్యాచ్ టిక్కెట్లు, క్యాష్‌బ్యాక్ మరిన్ని వంటి ఉత్తేజకరమైన బహుమతులను అన్‌లాక్ చేస్తాయన్నారు. ఈ క్యాంపెయిన్ యొక్క కొత్త టీవీసీలు ఒక ఆహ్లాదకరమైన మలుపునకు జీవం పోశాయన్నారు.

కంచు మాంబా ప్రాంగణంలో అన్నసమరాధన...

విశాలాంధ్ర-గాజువాక : గాజువాక నియోజకవర్గం 71వ వార్డు కుంచుమాంబ కాలనీ కుంచుమాంబ, వినాయక దుర్గా దేవి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు, వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు హాజరై అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బడుగు బలహీనవర్గాల కోసం తినడానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు అనే ఎజెండాతో ముందుకురావడం జరిగింది. రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు ద్వారా పేదవాడికి పట్టెడు అన్నము పెట్టడం ప్రజలు హర్షాతిరేకం తెలియచేస్తున్నారు.ఈ రోజు పి4 విధానంతో ప్రతి కుటుంబంలోను ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలని తద్వారా అన్ ఎంప్లాయిమెంట్ సమస్య పరిష్కారం కావాలని, చదువుకున్న యువతి యువకులు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా నిరుద్యోగులకు అవకాశం కల్పించేవిదముగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయడం , ప్రభుత్వాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం ప్రజలు గమనిస్తున్నారుఅని, ఇది చేతల ప్రభుత్వముకానీ , కోతల ప్రభుత్వముకాదని, ప్రభుత్వము చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియపర్చాలని పప్పు రాజారావు అన్నారు.ఈ కార్యక్రమములో కోలనీ కమిటీ పెద్దలు బొజ్జా కోటేశ్వరరావు , బాబురావు , తాతారావు , మణికంఠ ఇతర పెద్దలు వానపల్లి జగ్గారావు , సూరిశెట్టి ఋషిబాబు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.